క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్, అధికారులు

ఆదోని టౌన్ : పట్టణంలో నిర్మిస్తున్న పక్కా ఇళ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ సూచించారు. శనివారం మున్సిపాలిటీలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి ఉండేలా చూడాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. హౌసింగ్ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు.సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంతో పాటు అగసలదిన్నెలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు. అలాగే..స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో, వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆదోని సెంట్రల్ : పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో పూజారి ఆనంద ఆచారి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూర సేవ, తులసీ హారం, నైవేద్యం, మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెద్దకడబూరు : ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిక్కన్న, సీఐటీయూ నాయకులు దేవదాసు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను పని ప్రదేశంలో కలిసి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ మండలంలో చాలా మంది కూలీలకు జాబ్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతి కూలీకి 200రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు కనీసం రూ. 600 వేతనం ఇవ్వాలన్నారు. జాలవాడి గ్రామంలో పది రోజులుగా పనులు నిలిపివేశారని, సమస్యలను పరిష్కరించి పనులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

జయప్రదం చేయండి

ఆదోని రూరల్ : ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఈనెల 22వ తేదీన కర్నూలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కోరారు. శనివారం మండలంలోని పెద్దతుంబళం, కుప్పగల్లు, హానవాల్, జి.హొసళ్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న పని ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ, బడ్జెట్‌లో నిధులకు కోత పెట్టిందని విమర్శించారు.

ప్రశాంతంగా రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష

కర్నూలు (సిటీ) : ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ ఆధ్వర్యంలో స్కూల్స్, కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. పాఠశాల విభాగంలో 5వ తరగతి ప్రవేశాల కోసం, 6, 7, 8 తరగతులలో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 5,283 మంది దరఖాస్తు చేసుకోగా, 4,281 మంది పరీక్షలకు హాజరయ్యారు. 6వ తరగతి పరీక్షకు 1,460 మందికిగాను 1,094 మంది, 7వ తరగతి పరీక్షలకు 567 మంది దరఖాస్తు చేసుకోగా 413 మంది, 8వ తరగతి పరీక్షలకు 595 మంది దరఖాస్తు చేసుకోగా 463 మంది హాజరయ్యారు. కాలేజీ విభాగంలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం 7,546 మంది దరఖాస్తు చేసుకోగా 6,521 మంది హాజరు కాగా, 1,025 మంది గైర్హాజరయ్యారు. ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ప్రవేశ పరీక్ష కోసం 409 మంది దరఖాస్తు చేసుకోగా 316 మంది హాజరయ్యారు.

కలికితురాయి 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్.!

- ఎమ్మిగనూరు–ఆదోని హైవేలో ఎంఐజీ కాలనీ
- 110.10 ఎకరాల్లో 1,106 ప్లాట్లు



ఎమ్మిగనూరు ఎంఐజీ కాలనీకి సిద్ధం చేసిన భూములు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు అభివృద్ధి చరిత్రలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కలికితురాయిగా మారనుంది. ఆదాయపన్ను చెల్లింపుదారులకు ఎంఐజీ లేఅవుట్లను ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో మొదటి జగనన్న టౌన్‌షిప్ ఎమ్మిగనూరులో ఏర్పాటు కానుంది.

పట్టణ సమీపంలోనే..

ఎమ్మిగనూరు పట్టణానికి ఆరు కిలోమీటర్ల సమీపంలో బనవాసి అటవీ భూములున్నాయి. పశు సంవర్ధక శాఖకు చెందిన రెండువేల ఎకరాల్లోని 110.10 ఎకరాల్లో ఎంఐజీ కాలనీ ఏర్పాటు చేయనున్నారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) నేతృత్వంలోనే మధ్యతరగతి వర్గాలకు అందమైన కాలనీ ఏర్పాటు కానుంది.

టౌన్‌షిప్‌లో 1106 ప్లాట్లు

జగనన్న టౌన్‌షిప్‌లో 1,106 పాట్లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో మూడు సెంట్ల ప్లాట్లు 447, నాలుగు సెంట్ల ప్లాట్లు 440, ఐదుసెంట్ల ప్లాట్లు 199 ఉన్నాయి. 3 సెంట్ల ప్లాట్ ధర రూ.8,62,290లు, 4సెంట్ల ప్లాట్ ధర రూ.11,45,800లు, 5 సెంట్ల ప్లాట్ ధర రూ.13.79.760. ప్లాట్‌లో 5 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు, 10 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయి. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం, సింగిల్ పేమెంట్‌గా కట్టేవారికి 5 శాతం డిస్కౌంట్లు కూడా కల్పించారు.

నేడు కలెక్టర్‌చే జగనన్న టౌన్‌షిప్ బ్రోచర్ విడుదల

జిల్లా కలెక్టర్ సృజన ఆదివారం జగనన్న టౌన్ షిప్ బ్రోచర్‌ను విడుదల చేస్తారని కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. అలాగే 11 గంటలకు టౌన్‌షిప్ వెబ్‌సైట్ లాంచ్ చేస్తారన్నారు. ఎమ్మిగనూరు మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జాయింట్ కలెక్టర్ మౌర్య, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భార్గవ్‌తేజ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తదితరులు హాజరవుతారన్నారు.

అర్హులు

సంవత్సర ఆదాయం రూ.18 లక్షలలోపు ఉండాలి. 18 ఏళ్లు నిండి ఆదాయపన్ను చెల్లింపుదారులై ఉండాలి. ఒక కుటుంబంలో ఒక్కరే అర్హులు. దరఖాస్తు సమయంలో 10 శాతం, అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి నెలలోపు 30 శాతం, 6 నెలలకు 30 శాతం, 12 నెలలకు మరో 30 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి. అన్ని షరతులకు లోబడి అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్ htt p://migapdtcp.ap.gov.in

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ఆదోని రూరల్ : విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న భాష్యం స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాబీర్ బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ముందస్తుగా అక్రమ అడ్మిషన్లు చేసి, తప్పుడు ర్యాంకులతో బ్యానర్స్ ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. సీబీఎస్ సిలబస్ పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నాయకులు ప్రేమ్‌కుమార్, ప్రశాంత్, మంజు, మహేష్, హరి,వీరేష్, ఉదయ్, రంగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదోని అర్బన్ : వేసవి కాలంలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మజార్ అహ్మద్ తెలిపారు. శనివారం యార్డులో అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తేగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

ఖాళీ స్థలాల పరిశీలన



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, అధికారులు

ఆదోని టౌన్ : పట్టణంలో ప్రభుత్వ, మున్సిపాలిటీకి సంబంధించిన ఖాళీ స్థలాలను సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈఈ నాగభూషణ్‌రెడ్డి, ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈలు శనివారం పరిశీలించారు. మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పరిశీలించామని సబ్‌కలెక్టర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకొని ప్రహరీ ఏర్పాటు చేసి మొక్కలు నాటాలని కమిషనర్‌కు సూచించారు. పట్టణంలో విశ్రాంతి ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ ఎక్కువగా ఉన్నారని, వారి కాలక్షేపం కోసం పార్కులను మరింతగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. పార్కుల అభివృద్ధిపై ప్రతి 15 రోజులకొకసారి నివేదిక అందజేయాలని ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులకు సూచించారు. ప్రస్తుత పార్కుల పరిస్థితి, అభివృద్ధి పనులు చేపట్టిన 15 లేదా నెల రోజుల తర్వాత ఎలా ఉన్నాయనే వాటిపై నివేదిక సమర్పించాలని, పార్కుల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ నరసయ్య అనే వ్యక్తి తన ఇంటి వద్ద కర్ణాటక మద్యం అమ్ముతుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. నరసయ్య కర్ణాటకు చెందిన ఓసీ-90 ఎం.ఎల్. టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకుని 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

నేడు చెరుకులపాడులో నారాయణరెడ్డి వర్ధంతి

వెల్దుర్తి(కృష్ణగిరి)/తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త దివంగత నారాయణ రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు చెరుకులపాడులో ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి, తుగ్గలి మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. నారాయణరెడ్డి సమాధికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి, మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలా కుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200,ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఆన్‌లైన్ ద్వారా జూన్ 7లోగా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామ మలుపు వద్ద శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై నుంచి పడి సంతకల్లూరు గ్రామానికి చెందిన మౌల(35) మృతి చెందాడు.. మౌల.. డ్రైవర్‌తో కలిసి ట్రాక్టర్‌పై ఎమ్మిగనూరుకు వడిగడ్డిని తీసుకెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసి తిరిగి గ్రామానికి బయలుదారారు. డ్రైవర్ వెనక కూర్చున్న మౌల.. కోటేకల్ బస్టాప్ సమీపంలో కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావటంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

త్వరలో భూ పంపిణీ

తుగ్గలి: అసైన్‌మెంట్ కమిటీ ద్వారా నిబంధనల మేరకు మండలంలో త్వరలో భూ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో భూ పంపిణీకి వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం 232 మందికి 298.5 ఎకరాలు పంపిణీ చేసేందుకు పట్టాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న వారికి 3 ఎకరాల వరకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామన్నారు.

ప్రజల దరికి చేర్చండి

ఆలూరు/దేవనకొండ: ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చాలని కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఉమాంబ వలంటీర్లకు సూచించారు. సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్రా అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మరింత ఉత్సాహంగా పని చేయాలని వారు సూచించారు.

కృష్ణ జింకల వేటపై సమాచారమివ్వండి



పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి శివశంకర్‌రెడ్డి

ఆదోని అర్బన్ : గతేడాది మార్చి 6న ఆదోని రేంజ్ ఆలూరు సెక్షన్ నెరణికి తూర్పు బీట్‌లోని కమ్మరచేడు, నారాయణపురం గ్రామ పొలాల మధ్య 11 కృష్ణ జింకలను వేటాడి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన జిల్లా అటవీశాఖ అధికారి శివశంకర్‌రెడ్డిని విచారణాధికారిగా నియమించారు. వేటపై వివరాలు సేకరించేందుకు శనివారం స్థానిక అటవీ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే సమాచారం ఇచ్చేందుకు ఎవరూ రాలేదు. దీంతో ఆయన మాట్లాడుతూ.. వివరాలు అందజేయాలనుకునే వారు నేరుగా తన కార్యాలయానికి వచ్చి అందజేయవచ్చని చెప్పారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం..

పర్యావరణాన్ని రక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని అటవీశాఖ జిల్లాధికారి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, నీటి వృథాను అరికట్టడం, మొక్కలు పెంచడం మన చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీట్ అధికారి వెంకటేష్, రవి, షమీ ఉల్లా, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన





మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ప్రదీప్ రెడ్డి, నగదు బ్యాంకు ఖాతాకు జమ చేసిన పత్రాన్ని అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి


మంత్రాలయం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని, ఆయనను మరోసారి సీఎంగా గెలిపించుకుంటేనే పథకాలు కొనసాగుతాయని, టీడీపీ హయాంలో పథకాల కోసం పడిన అష్టకష్టాలను గుర్తు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకొని బుక్‌లెట్ అందజేశారు. అలాగే లబ్ధి పొందిన వివరాలు తెలియజేసి గత ప్రభుత్వాల పాలన, జగనన్న పాలనతో పోల్చి వివరించారు. సమస్యల గురించి ఆరా తీశారు. తన దృష్టికి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కారించేలా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభావతి, ఏపీఓ తిమ్మారెడ్డి, ఏఓ జీరాగణేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ షాదీ తోఫా జమ

మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన ముంతాజ్, హైదర్ అలీ ఇటీవల వివాహం చేసుకున్నారు. వీరు వైఎస్సార్ షాదీ తోఫా పథకానికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.లక్ష బ్యాంకు ఖాతాకు జమ అయ్యింది. దీంతో నగదు జమ అయిన పత్రాలను శనివారం మాలపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి వారికి అందజేశారు. ఎంపీడీఓ ప్రభావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ .జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులకు తెగిన విద్యుత్ తీగలు

కౌతాళం: ఈదురు గాలులతో కూడిన వర్షం శనివారం సాయంత్రం కురిసింది. దీంతో మండలంలోని బదినేహాల్ గ్రామం వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ లైన్‌లో సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. రాత్రి లోపు బదినేహాల్ గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఏఈ నర్సప్ప తెలిపారు.



బదినేహాల్ గ్రామం వద్ద 11 కేవీ తీగలు తెగిపోయిన దృశ్యం

నకిలీ విత్తనాలను అరికట్టాలి

పెద్దకడబూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో నకిలీ విత్తనాలను అరికట్టాలని ఏఐకేఎస్ డివిజన్ కార్యదర్శి మబ్బు అంజనేయ కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట శనివారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దళారులు రైతులకు ఆశ చూపి నకిలీ విత్తనాలను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గతేడాది నకిలీ విత్తనాల వల్ల రైతులు ఎకరానికి రూ.70వేల నుంచి రూ. లక్ష వరకు నష్టపోయారని గుర్తు చేశారు. ప్రధానంగా మిరప, పత్తి పంటలో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని వ్యవసాయ సిబ్బందికి అందజేశారు. నాయకులు లక్ష్మన్న, రమేష్, రాగన్న, రామాంజనేయ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కోసిగి: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు ఎం. గోపాల్, యువజన సంఘం తాలుకా కార్యదర్శి రాజు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈఓ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతోందని, గ్రామీణ ప్రాంతాల రైతులకు ఎక్కువ శాతం నకిలీ పత్తి విత్తనాలు అమ్మే అవకాశముందని, అధికారులు దాడులు నిర్వహించి విక్రేతలపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేవారు. రైతులు మోసపోకుండా చూడాలని కోరారు. సిద్ధప్ప, రమేష్, గొర్రెల చిన్న లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



కోసిగిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రుద్రగౌడ

కోసిగి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రుద్రగౌడ సూచించారు. శనివారం స్థానిక సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీల్లో లేఅవుట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోసిగిలో మూడు లేఅవుట్లలో 543 మందికి ఇళ్లు మంజూరవగా ఇప్పటి వరకు 30 ఇళ్లు పూర్తి కాగా, మరో 30 ఇళ్లు థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయని చెప్పారు. పనులు నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు, థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లకు ఆదేశించారు. హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ సోమప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భాస్కర్ చంద్రకళ, సాహితీ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఆదోని డివిజన్ ఈఈ సుధాకర్ కుమార్

ఆలూరు రూరల్: వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్‌కుమార్ సూచించారు. శనివారం ఆలూరు డీఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోఓల్టేజీ కారణంగా ఆదోని సబ్ డివిజన్‌లో ఇప్పటి వరకు 218 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయన్నారు. లైన్‌మెన్‌లు సాయంత్రం గ్రామాలకు వెళ్లి లోఓల్టేజీ సమస్యను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్తింగ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బందికి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవగాహన లోపం వల్లే ఇటీవలే హాలహర్వి మండలం మెదేహాల్ గ్రామంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడని గుర్తు చేశారు. బోరు కనెక్షన్ కింద రైతులకు సీనియారిటీ ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఏఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆలూరు డీఈఈ నాగేంద్ర ప్రసాద్, ఆదోని డివిజన్ ఏఏఓ ఈరన్న, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద ఏఈలు, లైన్‌మెన్‌లు, జేఎల్ఎంలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

బాలుడికి అరుదైన నార్స్ వ్యాధి

- మెరుగైన వైద్యంతో విజయవంతంగా చికిత్స



కోలుకున్న బాలుడితో వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): అత్యంత అరుదైన నార్స్ అనే వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడికి కర్నూలులోని కిమ్స్ వైద్యులు చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలను ఆసుపత్రి పీడియాట్రిక్ న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేత, డాక్టర్ నవీన్‌రెడ్డి శనివారం వివరించారు. వివరాలు వారి మాటల్లోనే...'ఆదోనికి చెందిన దీపక్(9) నాలుగో తరగతి చదువుతున్నాడు. ఉన్నట్లుండి అతనికి నాలుగు సార్లు మూర్ఛ, ఒకరోజు జ్వరం వచ్చింది. దీంతో వారు బాలుడిని కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈఈజీ, ఇతర పరీక్షల ఆధారంగా అతనికి నార్స్(న్యూ ఆన్‌సెట్ రిఫ్రాక్టరి స్టేటస్ ఎపిలెప్టికస్) అయి ఉంటుందని అనుమానించాము. వెంటనే ఇమ్యునోథెరపీ సహా దానికి సంబంధించిన చికిత్స ప్రారంభించాము. దీంతో నెమ్మదిగా అతనిలో మూర్ఛ తగ్గింది. అనంతరం అవసరమైన చికిత్స అందించాము. ఏప్రిల్ 8న చేరిన బాలుడికి ఆరు వారాల పాటు చికిత్స, సూచనలు, సలహాలు అందించాము. ఈ అరుదైన సమస్య విషయంలో భవిష్యత్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు వివరించాము. నార్స్ అనేది అరుదైన ప్రమాదకరమైన వ్యాధి. ఇది పూర్తి ఆరోగ్యవంతలైన పిల్లలు, యువకుల్లో అకస్మాత్తుగా సంభవిస్తుంది. ఇలా ఎందుకొస్తుందో స్పష్టమైన కారణం తెలియదు. ముందస్తుగా గుర్తించి తగిన చికిత్సను త్వరగా ప్రారంభిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చు అని' అని వారు వివరించారు.

జాతీయస్థాయి నాటికల పోటీల విజేతలు

కర్నూలు కల్చరల్ : టీజీవీ కళాక్షేత్రం, పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ సంస్థ సంయుక్త నిర్వహణలో ఈనెల 17, 18, 19 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి నాటికల పోటీల్లో విజేతల వివరాలను శనివారం ఆ సంస్థల అధ్యక్షుడు పసుపులేటి వెంకటరమణ, పత్తి ఓబులయ్య ప్రకటించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన నాటికలను తిరిగి ఒంగోలులో ప్రదర్శిస్తారు. ఉత్తమ నాటిక ప్రదర్శనగా హైదరాబాద్ కళాంజలి వారి 'రైతే రాజు', ద్వితీయ స్థానంలో గుంటూరు అమృతలహరి వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక నిలిచిందన్నారు. అలాగే ఉత్తమ నటుడిగా ఒంగోలుకు చెందిన చౌదరి, ద్వితీయ నటుడిగా కె.శ్యామ్‌ప్రసాద్, ఉత్తమ నటిగా ఎం.రత్నకుమారి, ఉత్తమ ద్వితీయ నటిగా జ్యోతి రాణి, క్యారెక్టర్ నటిగా అమృతవర్షిణి, ఉత్తమ సంగీతం పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యం, ఉత్తమ రంగాలంకరణ పి.బాబురావు, ఉత్తమ లైటింగ్ రమణ ఎంపికయ్యారన్నారు. అదే విధంగా రైతే రాజు నాటిక దర్శకులు కొల్లా రాధాకృష్ణ ఉత్తమ దర్శకుడు, ఉత్తమ రచనగా రైతే రాజు నాటకానికి రచన చేసిన సూర్యప్రకాష్ ఎంపికయ్యారన్నారు. మూడు రోజుల పాటు జరిగిన నాటికల పోటీలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నకిలీ విత్తనాలపై నిఘా పెంచండి

- రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించండి
- బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు ఆర్‌బీకేల ద్వారా పంపిణీ
- సబ్సిడీ విత్తనాల పంపిణీ పకడ్బందీగా చేపట్టండి
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుభరోసా కేంద్రంలో నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా పంపిణీ చేయాలని సూచించారు. ప్రధానంగా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేయాలని, ప్రభుత్వం ఏఏ కంపెనీలతో ఒప్పందం చేసుకుందో.. ఆ కంపెనీల వివరాలను ఆర్‌బీకేల్లో డిస్‌ప్లే చేయాలని సూచించారు. నకిలీలకు తావు లేకుండా ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని, నకిలీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లడంలో వ్యవసాయ శాఖ విఫలమవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లూరు మండలం ఉల్లిందకొండ చెరువులో చేపల పెంపకం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ... సబ్సిడీపై రైతులకు వాటర్ క్యారియింగ్ పైపులు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. సమావేశంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రయ్య, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామలమ్మ, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.